కథ

భమిడిపాటి సోమయాజి

# శఠకోపాచారికి శఠగోపం!

శఠకోపాచారి దినపత్రిక చదువుతున్నాడు. ఆండాళ్ళు లోపల్నుంచి అరుగు దగ్గరకొచ్చి "యిప్పుడు పన్నెండున్నర అవుతోంది! ఇప్పట్నుంచి సాయంకాలం గుడి తీసేవరకు ఆ పత్రిక పట్టుకు కూర్చుంటారు. అసలీ తీరిక సమయంలో, ఏ రచనా వ్యాసంగమో కొనసాగిస్తే, కొంత దబ్బు సంపాదించవచ్చుకదా!"


"రచనా వ్యాసంగం అంత సులువు కాదు"

"ఏ కథలైనా రాయడం మొదలుపెట్టండి!"


ఈ రకమైన పోరు భరించలేని శఠకోపం, కోపంతో కొన్ని తెల్లకాయితాలు కొని, కథలు రాయడం మొదలుపెట్టాడు. కొన్ని కథలు అచ్చయ్యాయి. కొన్ని కథలు 'గోవిందా' అయిపోయాయి. ఎవ్వరైనా గుళ్ళో అర్చన తొందరగా చేయించుకోవాలంటే "అయ్యా! మొన్న మీ కథ ఒకటి చదివాం! చాలా బాగుంది!" అంటే అర్చన శీఘ్రంగా చేసి, వాళ్ళని పంపించేసేవాడు. అల్ప సంతోషి!

ooo

ఆ ఊళ్ళోవాళ్లు 'శఠకోపాచారి, పూజరి కం రచయిత' అని ఓ బోర్డు రాయించి, ఆయన సింహద్వారం పక్కన వేలాడతీసారు. ఆ దగ్గర్లో నివాసమున్న ప్రభుత్వోద్యోగి, ఒకతను ఆ బోర్డు చూసి బాగుంది 'క్లర్క్ కం టైపిస్ట్'లా అన్నాడు. "మీరు రాయలేరు! ఎదుటివాళ్లు రచయితలైతే చూడలేరు!" అని ఎద్దేవా చేసింది, అతని భార్య.



ఓ రెండేళ్ళలో, ఓ నలభై కథలు వివిధ పత్రికల్లో అచ్చయ్యాయి! చాలామంది ఓ కథల సంపుటి వేయించమన్నారు. ఓ ప్రింటింగ్ ప్రెస్ యజమాని, ఓసారి సహస్రనామార్చన చేయించుకోవడానికి



గుడికి వచ్చాడు. అర్చన అయిన తర్వాత, శఠకోపం "ఓ సంపుటి వెయ్యడానికి ఎంత ఖర్చవుతుంది" అని అడిగాడు.

"అయిదు వందల కాపీలైతే యిరవై వేలు, వెయ్యి కాపీలైతే ముప్ఫయి వేలు. అయినా మీరొకసారి మీ కథలు చూపించండి. ఎన్ని పేజీలొస్తుందో చూద్దాం!" అన్నాడు ఆ ప్రింటింగ్ ప్రెస్ ఓనర్.

తర్వాత ఓ వెయ్యి కాపీలు వేయించడానికి, యిరవై అయిదు వేలు యిస్తానని ఒప్పుకున్నాడు శఠకోపం. శఠకోపం చేస్తున్న పనికి, ఆండాళ్ళుకి కోపం వచ్చింది. "అసలీ కథలు రాయడానికి నువ్వే మూల కారణం" అని కోపంగా తిట్టాడు శఠకోపం.

## వరస హిట్లు!

కామ్‌గా కనిపిస్తూనే వరస హిట్లు కొడుతోంది కత్రినా కైఫ్. అప్నే, నమస్తే లండన్, పార్ట్‌నర్, వెల్‌కమ్, రేస్... ఇలా వరసగా ఐదు హిట్ చిత్రాల్లో నటించిన హీరోయిన్ ఈమధ్య కాలంలో వేరెవరూ లేరు అంటున్నారు బాలీవుడ్ ట్రేడ్ పండితులు. కత్రినా కెరీర్ ఆరంభంలో కాస్త నత్తనడకగా సాగినప్పటికీ, సల్మాన్ ఖాన్ ఎఫైర్‌తో రకకరాల వార్తలు వచ్చినా చెక్కు చెదరకుండా ముందుకెళ్లి సక్సెస్‌ఫుల్ స్టార్‌గా నిలిచింది కత్రినా.

పుస్తకాలు చాలా కొద్ది మాత్రమే అమ్ముడుపోయాయి. చాలామంది ఊరికే చదివేసారు. చదివినవారు చదివినట్టుండక, కథలు చాలా బాగున్నాయ్ అని ప్రత్యేకంగా గుడికి వెళ్లి, శఠకోపానికి చెప్పేవాడు. వాళ్లకి దద్యోజనం, చక్కర పొంగలి యింకాస్త తినండి అని పెట్టేవాడు. కథలు బాగున్నాయని చెప్తే, అర్చన తొందరగా చేసేవాడు.

కథలు బాగున్నాయంటే శఠకోపం పొంగిపోతున్నాడన్న విషయం, ఆ నోటా ఆ నోటా ఊరంతా తెలిసింది. గుడిగి వెళ్లే వ్యవధిలేనివారు శఠకోపం యింటికి వచ్చి, దద్యోజనం చక్కర పొంగలి తినేషారు. ఈ విషయాలు పక్క ఊళ్లకి కూడా పాకేయి.

ooo

ఓ వేసంకాలం, చలువ కళ్లద్దాలు పెట్టుకుని, కార్లో ఓ ఆసామీ వచ్చాడు. శఠకోపం అరుగుమీద నుంచి లేచి, ఆయన ఏం పని మీదొచ్చాడో అడిగి తెలుసుకున్నాడు.

"మీరు మంచి రచయిత అని తెలిసి వచ్చాను. మీ కథల సంపుటి ఎన్ని కాపీలు యివ్వగలరు!"

శఠకోపాచారి పొంగిపోయాడు! తన భాషా ప్రతిభ చూపిద్దామని "కొమ్మా! పానీయంబులు తెమ్మా!" అని ఆండాళ్ళని ఆజ్ఞాపించాడు.

"అబ్బా! ఏమి యతి ఏం ప్రాస" అన్నాడు అతను.

మళ్లీ పొంగిపోయాడు శఠకోపం! ఎండవేళ కదా అని, ప్రత్యేకంగా దద్యోజనం చేయించి పెట్టాడు. ఆ దద్యోజనం ఆరగించి, ఓ రెండు వందల పుస్తకాలు అమ్ముతానని చెప్పి, స్వీకరించి తరలి పోయాడు, ఆ నల్లకళ్ళజోడు ఆయన! అలా పెద్ద 'పుస్తక స్వీకారం' జరిగింది.

ooo

ఓ ఏడాది గడిచిపోయింది. ఆ రెండువందల పుస్తకాలు బాపతు సొమ్ములో ఒక్క రూపాయి కూడా అందలేదు శఠకోపానికి.



ఎడ్వాన్స్ కొంత సొమ్మైనా తీసుకోనందుకు యధాశక్తి తిట్టింది ఆండాళ్ళు.

"నిన్నడిగే యిచ్చాను కదా పుస్తకాలు!"

"ఇంట్లో ఎక్కడ చూసినా అవే! అందుకని యిమ్మన్నాను. పుస్తకాలు పోతే పోయాయ్. ఓ కిలో దద్యోజనం చల్లగా పొట్టన పెట్టుకున్నాడు" అంది ఆండాళ్ళు.

ooo

కొన్ని రోజుల తర్వాత, "మీ 'గజిబిజి జిలేబి' అనే కథ చదివాను. చాలా బాగుంది, ఏమైనా అవకాశం యిప్పిస్తే సినిమాకి మాటలు రాస్తారా!" అంటూ ఒకడు వచ్చాడు.

'మీరు చెప్పిన కథంటే నాకు చాలా యిష్టం!' అంటూ పాఠకుల నుంచి వచ్చిన రెండు ఉత్తరాలు ఆయన చేతికందించాడు శఠకోపం.

అవి చదివి "కథ గురించి ఎక్కువ రాయకుండా కథ మళ్ళీ మళ్ళీ చదివించింది అని చాలా ముచ్చటగా రాసారు" అంటూ మెచ్చుకున్నాడు.

అక్కడే వున్న ఆండాళ్లు 'కథ అర్థం కాకపోతే మళ్ళీ మళ్ళీ చదివుంటారు వెర్రి మొహాలు' అనుకుంది.

ఆయన సినిమాకి మాటలు రాయడం గురించి మళ్ళీ అడిగాడు.

"పగలు గుళ్లో పన్లుంటాయ్! రాత్రిళ్లయితే రాయగలను!" అన్నాడు శఠకోపం.

మంచి సమయం మించినన్ దొరకదు అనుకుంటూ 'ఓ పాతిక పుస్తకాలివ్వండి, సినిమా వాళ్లకి చూపిస్తానని' యధాశక్తి పుస్తక స్వీకారం చేశాడు.

ఈ సినిమాల్లో అవకాశం వస్తే ఏ జిగినీ గొలుసైనా చేయించుకోవచ్చని క్రిందటి బ్రహ్మోత్సవాల్లో తన భర్తకి ఎవరో పెట్టిన పట్టుపంచె, కండువా ఆయన చేతిలో పెట్టించి నమస్కారం చేయించింది ఆండాళ్లు.

వీడూ పత్తాలేడు, మళ్లీ.

ఇదేదో 'కథల సంపుటి-కష్టాల కుంపటి'లా తయారయ్యిందని బాధ పడ్డాడు శఠకోపం.

గుళ్లో భక్తితో ఆశీర్వచనం పలుకుతూ భక్తులకు శఠకోపం పెట్టే శఠకోపాచారికి యింటికొచ్చి మరీ శఠగోపం పెట్టిపోతున్నారు, నిరంతరంగా నిత్యనూతనంగా.